

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# సీజ్‌తో సరా?

## మైనింగ్ నియమాలన్నీ మట్టి పాలు- పరిగిలో ఖనిజ సంపదకు కన్నం

## ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.3 కోట్ల గండి

## - చోద్యం చూస్తున్న మైనింగ్, పోలీస్, రెవెన్యూ

## సిక్కా పడితేనే బ్రేక్ పడేది!



**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి**

**వికారాబాద్ జిల్లాలో ఎర్రమట్టి అక్రమ రవాణా వ్యవహారం అధికారులకు సీజ్ అండ్ రిలీజ్ గేమ్‌లా మారింది. అక్రమంగా ఖనిజ సంపదను తరలిస్తున్న వాహనాలను పట్టుకోవడం, సీజ్ చేసి చేతులు దులుపుకోవడం వల్ల దోపిడీకి బ్రేక్ పడటం లేదు. అసలు దొంగలపై కేసులు ఎప్పుడు నమోదు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమాలకు శాశ్వతంగా చెక్ పెట్టడంపై అధికారులకు చిత్తశుద్ధి కొరవడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

పరిగి కేంద్రంగా ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు. కొన్ని శాఖలకు నెలవారీ మామూళ్లు సమర్పించి జాతీయ రహదారిపై దర్జాగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు. సంపదను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. తమ జేబులు నింపుకొంటూ కొంతమందికి మేత వేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు పనుల కోసం ఎర్రమట్టి తవ్వుకుంటున్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నా కొన్ని శాఖల కనుసన్నలలో అక్రమ రవాణా దర్జాగా సాగుతోందని సమాచారం.

పూడూరు, పరిగి మండలాల్లో ఎర్రమట్టి నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. ఎర్రనేలలకు ప్రసిద్ధిగాంచిన ఈ రెండు మండలాలతో పాటు దోమ, కులకచర్ల మండలాల్లో కూడా ఎర్రమట్టి నిల్వలు ఉన్నాయి. ఈ ఖనిజ సంపదను తవ్వకాలు చేపట్టాలంటే పలు శాఖల అనుమతులు కచ్చితంగా పొందాలి. అందులో ప్రధానంగా ఖనిజాలు ఉన్న భూమి పట్టాదా, లేక ప్రభుత్వ భూములా పరిశీలించాలి. ఇటీవల కాలంలో ప్రభుత్వ భూములకు మైనింగ్‌శాఖ నుంచి ఎలాంటి లీజులు ఇవ్వడం లేదు. ప్రభుత్వ మైనింగ్ భూములకు వేలం పాట ద్వారా కేటాయించే ప్రక్రియ ఇంకా అమలు కావడం లేదు. పట్టా భూముల్లో తవ్వకాలు జరపాలంటే ముందుగా సదరు రైతు రెవెన్యూశాఖ ద్వారా ఎన్‌వోసీ పొందాలి. అనంతరం మైనింగ్ విభాగం నుంచి లీజులకు దరఖాస్తు పొందాలి. క్యూబిక్ మీటర్ చొప్పున రాయల్టీ చెల్లిస్తేనే మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు వస్తాయి. అందులో తాత్కాలిక లీజు కింద కేవలం రెండు నెలలు మాత్రమే ఇస్తారు. ఒక ఎకరా భూమికి మైనింగ్ తవ్వకాలు చేపట్టాలంటే కనీసం 6 లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి. కానీ పరిగి నియోజకవర్గంలో దాదాపు 90 శాతం అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు.

దీనిద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.2 నుంచి 3 కోట్ల రూపాయల వరకు గండి కొడుతున్నారని తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని మైనింగ్‌శాఖ తాండూరు అధికారులు, పరిగి రెవెన్యూ అధికారులు, పరిగి సబ్‌డివిజన్ పోలీసు అధికారులు సంయుక్తంగా అడ్డుకోవాలి. అయితే ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వారిపై కొరడా ఝుళిపించటానికి అధికారాలు ఉన్నా ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు నామమాత్రమేనని విమర్శలు వస్తున్నాయి. ఖనిజాలను అక్రమంగా తరలించే వారి వాహనాలను సీజ్ చేయడమే కాకుండా యజమానులపై కఠినమైన కేసులు నమోదు చేసే అధికారాలు వారికి ఉన్నాయి. ఈ అక్రమార్కులు దర్జాగా పట్టపగలే నేషనల్ హైవేపై భారీ వాహనాలను రవాణా చేస్తున్నారు.

పరిగి కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా కూడా జోరుగా సాగుతోంది. కరీంనగర్ నుంచి వచ్చే ఇసుక వాహనాలకు తోడుగా యాలాల, బొంరాస్‌పేట మండలాల నుంచి పరిగి పట్టణానికి ఇసుక తరలివస్తోంది. అయితే, కరీంనగర్ ఇసుకను అక్కడ క్యూబిక్ మీటర్ చొప్పున డబ్బులు చెల్లించి ఇక్కడికి తెస్తున్నా అవే అనుమతులతో యాలాల ఇసుకను రవాణా చేస్తున్నట్లు తెలిసింది. ఈ కుంభకోణం వెనక కొంతమంది అధికారుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిత్యం యాలాల, బొంరాస్‌పేట మండలాల కాగ్నా, కాకరవేణి నదుల నుంచి వాహనాలలో పరిగికి రవాణా అవుతోంది. దీన్ని అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపితే పలు శాఖల అధికారులకు శాఖపరమైన చర్యలు తప్పవని అంటున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకపాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు ముమ్మరంగా దాడులు చేస్తే అనేక నిజాలు వెలుగు చూడనున్నాయి.

**కేసు నమోదు చేస్తాం : డీఎస్పీ**

ఎర్రమట్టి, ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేస్తామని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇటీవల అక్రమ దందాపై తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అనుమతులు లేకుండా ఖనిజాలు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై నేషనల్ హైవేపై నిరంతరం నిఘా పెడతామని స్పష్టం చేశారు. కొన్ని శాఖలపై వచ్చిన అవినీతిమరకలపై డీఎస్పీ స్పందిస్తూ.. పోలీసుశాఖ మాత్రం నిజాయతీగా పనిచేస్తోందని వివరణ ఇచ్చారు. తమ శాఖకు ఎవరూ మామూళ్లు ఇవ్వవద్దని, ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

# షాడో షో



**ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీలో మాయాజాలం**

**బాస్ కనుసైగతో పక్కా ప్లానింగ్**

**అనుమతులు లేని నిర్మాణాలే టార్గెట్‌గా కాసుల వేట**

**యజమానులతో భారీగా బేరసారాలు**

**సంతృప్తి పరిస్తే ఎలాంటి కట్టడానికైనా పచ్చజెండా**

**ఇబ్రహీంపట్నం, మార్చి 30, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో భవన నిర్మాణ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. నిబంధనల ప్రకారం రోడ్డు వెడల్పును బట్టి అంతస్తుల అనుమతి ఉండాలి. కానీ ఇక్కడ దానికి భిన్నంగా వ్యవహారం నడుస్తోంది. మున్సిపాలిటీని అవినీతి అడ్డాగా మార్చిన ఈ మాయాజాలంపై సామాన్యులు మండిపడుతున్నారు.

**నిబంధనల ఉల్లంఘన ఇలా..**

కేవలం జీ+2 అనుమతులు తీసుకుని క్షేత్రస్థాయిలో ఏకంగా 5, 6 అంతస్తులు అక్రమంగా నిర్మిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కనీసం అడుగు స్థలం కూడా వదలకుండా రోడ్లను ఆనుకుని భారీ కట్టడాలు నిర్మిస్తున్నా ప్లానింగ్ విభాగం ప్రేక్షకపాత్ర వహిస్తుండటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీలో కీలక విభాగంలో పనిచేస్తున్న ఒక అసిస్టెంట్ ఇప్పుడు షాడో అధికారిగా అవతారమెత్తారని చర్చ జరుగుతోంది. ఎక్కడ అక్రమ నిర్మాణం మొదలవుతుందో పసిగట్టడం, వెంటనే అక్కడ వాలిపోయి యజమానులతో బేరసారాలు కుదుర్చుకోవడంలో సదరు అసిస్టెంట్ సిద్ధహస్తుడని ఆరోపణలు వస్తున్నాయి. పై అధికారి కనుసైగ చేయడం, ఈ అసిస్టెంట్ వసూళ్లు ముగించడం అంతా ఒక పద్ధతి ప్రకారం సాగుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, కేవలం స్వలాభమే పరమావధిగా సాగుతున్న ఈ అక్రమ దందాపై ఇకనైనా పై అధికారులు దృష్టిపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు: కమిషనర్ సుదర్శన్**

మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణాలపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మున్సిపాలిటీ కమిషనర్ సుదర్శన్ తెలిపారు. కనీసం విజిలెన్స్ విభాగమైనా కదిలి వస్తుందా లేక అంతా మామూలే అని వదిలేస్తారా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది

# మద్యం అమ్మితే రూ.50 వేల ఫైన్

**రోల్ పంచాయతీ సంచలనం తీర్మానం- బెల్ట్ షాపు నడపటానికి వీల్లేదని నిర్ణయం**

**కోట్‌పల్లి, మార్చి 30, ప్రభాతవార్త:** "మధుపానం.. మహా ఆనందం.. మనో ధైర్యం ధనాధన్" అంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సినిమా డైలాగులు మద్యం ప్రియులకు వినోదాన్ని ఇవ్వొచ్చు ఏమో కానీ, బీరోల్ గ్రామస్తులకు మాత్రం ఆవేదనను మిగిల్చాయి. అందుకే, మద్యం మహమ్మారిని తరిమికొట్టేందుకు ఆ గ్రామ పంచాయతీ పాలకవర్గం నడుం బిగించింది. సోమవారం నాడు సర్పంచ్ మొముల సుధాకర్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ఇకపై బెల్ట్ షాపులు నడవడానికి వీల్లేదని, ఎవరైనా మద్యం అమ్మితే రూ. 50 వేల భారీ జరిమానా విధిస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. హద్దు మీరితే కఠినమైన కేసులు కూడా నమోదు చేయిస్తామని సర్పంచ్ హెచ్చరించారు.

**ఆరోగ్యం కోసమే ఈ అడుగు..**

ముఖ్యంగా యువత మద్యం బారిన పడి తమ ఆరోగ్యాన్ని, ఆర్థిక స్థితిని నాశనం చేసుకుంటున్నారని, దీనివల్ల కుటుంబాలు చిన్నా భిన్నమవుతున్నాయని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వినూత్న నిర్ణయానికి సహకరించిన వార్డు సభ్యులకు, గ్రామస్థులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు



మద్యం నిషేధించాలని తీర్మానం చేస్తున్న సర్పంచ్ మొముల సుధాకర్, ఉప సర్పంచ్ తలారి రాజు, వార్డు సభ్యులు



అయిల్‌పామ్ తోటలను సందర్శిస్తున్న రైతులు

# ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు ఖాయం

**ఆధునిక పద్ధతులపై అవగాహన**

**కొడంగల్, మార్చి 30, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ రైతాంగానికి సాగులో ఆధునిక పోకడలు, ప్రత్యామ్నాయ లాభధాయక పంటలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసకుంది. ఇందులో భాగంగా సోమవారం కొడంగల్ అభివృద్ధి ప్రత్యేక అధికారి(కడ) వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాఈబాద్, బొంరాస్‌పేట్, కోస్గీ, దుద్యాల, గుండుమాల్, మద్దూర్, కొత్తపల్లి తదితర మండలాల నుంచి సుమారు 120 మంది రైతులను భద్రాది కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటలోని అయిల్‌పామ్ క్షేత్రాల సందర్శనకు తీసుకెళ్లారు. పర్యటనలో భాగంగా రైతులు అశ్వారావుపేటలోని వివిధ అయిల్‌పామ్ తొటలను పరిశీలించారు.

# వేలం మీద ఉన్న శ్రద్ధ వసతుల మీద ఏది?

**ధారూర్ సంతలో సమస్యలపై స్థానికుల అసహనం**

**రూ.6.50 లక్షలకు తైబజార్ పాట ఖరారు**

**ధారూర్, మార్చి 30, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలోని ప్రతి శనివారం జరిగే సంత తైబజార్ వేలం పాటను సోమవారం అధికారులు నిర్వహించారు. ఈ వేలంలో ఆవుసుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ 6,50,810 (ఆరు లక్షల యాభై వేల ఎనిమిది వందల పది రూపాయల)కు తైబజార్ హక్కులను దక్కించుకున్నారు. మండల పంచాయతీ అధికారి షఫీ ఉల్లా ఖాన్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేలంలో దుకాణాల వేలం కూడా నిర్వహించారు. ఇందులో రెండు దుకాణాలు ఒక్కొక్కటి ..2,500 చొప్పున, మరో రెండు దుకాణాలు ..1,500 చొప్పున వేలం పాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీల చిన్నయ గౌడ్, ఉప సర్పంచ్ జంగీర్, వార్డు సభ్యులు జకీర్, పంచాయతీ కార్యదర్శి అంజ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. వేలం పాట సందర్భంగా సంతలో కనీస వసతులు లేవని పాల్గొన్న అభ్యర్థులు, స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ఏటా వేలం నిర్వహించి లక్షల రూపాయల ఆదాయం పొందుతున్నారే తప్ప, సంతకు వచ్చే వారికి నీడ, తాగునీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు కల్పించడం లేదని వారు వాపోయారు. ప్రతిసారి హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయడం లేదని విమర్శించారు. దీనిపై సర్పంచ్ ప్రమీల చిన్నయ గౌడ్ స్పందిస్తూ.. త్వరలోనే బాడీ మీటింగ్ నిర్వహించి, సంతలో వసతుల కల్పనపై ప్రత్యేక తీర్మానం చేస్తామని హామీ ఇచ్చారు. ఈసారి ఖచ్చితంగా మోలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.



ఎంపివో పర్యవేక్షణలో నిర్వహిస్తున్న వేలం



పెట్రోల్ బంక్ ముందు చెత్త వాహనాలతో నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు

**తాండూరు మున్సిపల్ అధికారుల వినూత్న నిరసన**

**నిర్లక్ష్యం చేస్తే ఆస్తులు సీజ్ చేస్తామని కమిషనర్ హెచ్చరిక**

# పన్ను చెల్లించలేదా!.. చెత్త వాహనాలతో వస్తున్నాం

**తాండూరు, మార్చి 30, ప్రభాతవార్త :** పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం తగదని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ పరిధిలో పన్ను వసూళ్లపై అధికారులు విన్నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తున్న యజమానుల వద్దకు మున్సిపల్ వాహనలతో చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను చెల్లించాలంటూ సోమవారం తాండూరు పట్టణం హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఉన్న ఇలాహి పెట్రోల్ బంక్ వద్దకు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి సిబ్బందితో కలిసి మున్సిపల్ చెత్త వాహనాలు ఆటోలు, ట్రాక్టర్లతో తరలివెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్ పన్నుల చెల్లింపులో నిర్లక్ష్యం తగదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పన్ను వెంటనే చెట్టించాలని, పన్ను చెల్లించకపోతే ఆస్తులను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

# 'హాల్లో అరైవ్ అలైవ్'

**రోడ్డు ప్రమాదాల నివారణకు కలెక్టర్ పిలుపు**

**తాండూరు, మార్చి 30, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. సోమవారం తాండూరు మండలం కరన్‌కోట్ సిసిఐ కమ్యూనిటీ 'హాల్లో అరైవ్ అలైవ్' కార్యక్రమంలో మాదకద్రవ్యాల వ్యతిరేకత, రోడ్డు భద్రతపై అవగాహన, ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, కర్మాగారం యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని, ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి నెల రోడ్డు భద్రతపై సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

వాహన దారులు హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ సంఖ్యలో మరణాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు రద్దీగా ఉంటే ప్రదేశాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తూ, కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# ఆస్తి రాసిస్తే..అనాధను చేశాడు

**ప్రజావాణిలో కుమారుడిపై కలెక్టర్‌కు తల్లి ఫిర్యాదు**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** కన్న కొడుకే తల్లిని రోడ్డు పాలు చేశాడు. రెక్కలు ముక్కలు చేసుకొని పెంచిన కనికరం లేకుండా ఆస్తిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఆపై గంజి నీళ్ళు కూడా పోయకుండా అమానుషంగా ఇంటి నుండి గెంటేసిన ఘటన వికారాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. బొంరాస్‌పేట్ మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన పద్మమ్మకు ఉన్న ఒక ఎకరం భూమిని తన ఒక్కగానొక్క కొడుకు పేరిట రిజిస్ట్రేషన్ చేయించింది.

అయితే ఆస్తి చేతికి రాగానే కొడుకు అసలు స్వరూపం బయటపెట్టాడు. తల్లిని కనీసం మనిషిగా కూడా చూడకుండా తిండి పెట్టకపోగా ఇల్లు వదిలి వెళ్ళాలని వేధించడం మొదటుపెట్టాడు. చివరకు అమెను ఇంటి నుండి బయటకు గెంటేయడంతో దిక్కుతోచని స్థితిలో ప్రస్తుతం తన కూతురు వద్ద ఆశ్రయం పొందుతోంది. వయస్సు మళ్ళిన తరుణంలో కొడుకు చేసిన అన్యాయాన్ని భరించలేక పద్మమ్మ సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుంది. ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తన గోడును వెళ్ళబోసుకుంది. ఆస్తి తీసుకొని తనను అనాధను చేశాడని, తన భూమి తనకు ఇప్పించి, కొడుకుపై చర్యలు తీసుకోవాలని కన్నీటి పర్యంతమైంది. వృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం పద్మమ్మకు న్యాయం చేస్తామని ఆస్తి రిజిస్ట్రేషన్ రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.





బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శిరీష ఫొటోలో వైస్‌చైర్మన్ మాలతి, కమిషనర్ చంద్రశేఖర్

# రూ.10కోట్లతో బడ్జెట్ బండి

**అలియాబాద్ అభివృద్ధికి కౌన్సిల్ పచ్చజెండా**

**శామీర్‌పేట, మార్చి 30, ప్రభాతవార్త :** అలియాబాద్ మున్సిపల్‌కు సంబంధించి 2026-2027సంవత్సరానికి రూ.10కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలుపటం జరిగిందని మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం హాల్‌లో అంచనా బడ్జెట్ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డులను విడతల వారీగ అభివృద్ధి చేయటం జరుగుతుందని, దీనికి అందరు కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. 2026-2027 అంచనా బడ్జెట్ ఆర్థిక సంవత్సరంనకు రూపొందించి ఆమోదం పొంది ఏకగ్రీవంగ తీర్మానం చేయటం జరిగిందన్నారు. ఇంటి పన్నులు రూ.4.45కోట్లు, షాపింగ్ కాంప్లెక్స్ అద్దె 9లక్షలు, ముటేషన్ 9లక్షలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు 12లక్షలు, భవన అనుమతిపై ఆదాయం 2.25కోట్లు, లేఅవుట్,సబ్‌డివిజన్ ఫీజు 1.75 కోట్లు, ఇఎండిల ద్వారా ఆదాయం 1.5లక్షలు, మొత్తం మున్సిపల్ సాదారణ ఆదాయం 10కోట్ల20లక్షల రూపాయలుగ అంచనా వేయటం జరిగిందన్నారు.

దీనిలో ఖర్చులు సిబ్బంది వేతనాలు 2.75కోట్లు, శానిటేషన్‌కు 94లక్షలు, కరంట్ చార్జీలు 26లక్షలు, గ్రీన్ బడ్జెట్ 10శాతం కోటి18లక్షలు, నర్సరీ పెంపకం, మొక్కల పెంపకంకు మెయింటనెన్స్ వర్క్సుకు సుమారు కోటి59లక్షలుగా రూపొందించటం జరిగిందన్నారు.

అభివృద్ధి పనులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు 3కోట్ల26లక్షలు, మొత్తం 9కోట్ల62లక్షల రూపాయలుగ, మిగులు నిల్వ 58లక్షలుగ అంచన బడ్జెట్ రూపొందించిన వివరాలు తెలియజేశారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, ఎఇ, పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




శ్రీనాథ్‌రెడ్డి దంపతులను సన్మానం చేస్తున్న గ్రామస్థులు, నూతనంగా నిర్మించిన గోపాలక్రిష్ణ ఆలయ ముఖ ద్వారం

## ఆలయ ముఖద్వారానికి చేయూత

**పెద్దేముల్, మార్చి 30, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన గంగసారం శ్రీనాథ్‌రెడ్డి గోపాలక్రిష్ణ ఆలయ ముఖ ద్వారం నిర్మాణం కోసం రూ. 8 లక్షలు విరాళం అందజేశారు. సోమవారం ముఖద్వారం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ఆవరణలో వేదపండితుల సమక్షంలో యజ్ఞ హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ, అన్నదాన కార్యాక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు మాజీ చైర్మెన్ ప్రభాకార్‌రెడ్డి, న్యాయవాది గోపాల్‌రెడ్డి, డిఎల్‌డిఎ మాజీ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, మాజీ చైర్మెన్ కిషన్‌నాయక్, యువనాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ ముఖద్వారం నిర్మాణానికి శ్రీనాథ్‌రెడ్డి ఆర్థికంగా చేయూత ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. వయసులో చిన్న వాడైన గొప్ప నిర్ణయం తీసుకొని తన తండ్రి పేరు నిలబెట్టారని గుర్తుచేశారు. ఈ సందర్బంగా శ్రీనాథ్‌రెడ్డి దంపతులను ఆలయ కమిటి సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ ముదిని రాములు, పలువురు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి

## రూ. 2.64 లక్షలకు తైబజార్ వేలం

**పెద్దేముల్, మార్చి 30, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కేంద్రంలో సోమవారం గ్రామ సర్పంచ్ డివై నర్సిములు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లాలప్ప అధ్వర్యంలో తైబజార్, వాటర్ పిల్టర్‌ను వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో చాకలి రంగయ్య తైబజార్ (సంత)ను రూ.2 లక్షల 64 వేల 500లకు, వాటర్ పిల్టర్‌ను బోయిని బిచ్చప్ప రూ. 3 లక్షల 21 వేలకు వేలం పాట పాడి కైవసం చేసుకున్నారు. ఈ సందర్బంగా సర్పంచ్ డివై.నర్సిములు మాట్లాడుతూ ప్రజలకు, చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని అన్నారు. ఈ వేలం పాట ద్వారా గ్రామ పంచాయతీకి సుమారు రూ.5 లక్షల 85 వేల వరకు సంవత్సర ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆంజనేయులు, మల్లప్ప, చాకలి రవి, వెంకటక్రిష్ణ, లక్ష్మన్, అనురాధ, మైసమ్మ, డివై నర్సమ్మ, కవిత, పంచాయతీ కారోబార్ నర్సిరెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

## మైసమ్మ హుండీ ఆదాయం రూ. 9.8 లక్షలు

**కడ్తల్ మార్చి 30, ప్రభాతవార్త :** కడ్తల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయంలో సోమవారం దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ ప్రణీత్ ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మి ్మ సిరోలి పంతు నాయక్, ఈఓ స్నేహలత ఆధ్వర్యంలో 60 రోజుల హుండీ లెక్కింపు జరిగింది. రూ. 9 లక్షల 80 వేల 780 రూపాయల నగదు కానుకలు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, ఎస్సై వరప్రసాద్, ఆలయ ట్రస్ట్ సభ్యులు ఆర్పీ భాస్కర్, వి. అరుణ్, ఆలయ ముఖ్య అర్చకులు మాదారం యాదగిరి సిబ్బంది పి. కృష్ణ, బి. చంద్రయ్య, జి. రాములు, శ్రీనివాసులు, పత్య నాయక్, హర్షవర్ధన్, బీబీ చారి, శ్రీను, అన్నపూర్ణ సేవా ట్రస్ట్ వారు, ఆలయ సిబ్బంది, కెనరా బ్యాంకు అధికారులు, పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**ధారూర్, మార్చి 30, ప్రభాతవార్త :** ధారూర్ మండల పరిధిలోని రాజపూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం సోమవారం నిర్వ హించారు. గ్రామ సర్పంచ్ కుర్వ దివ్య శ్రీశైలం ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ సురేందర్ నాయక్ పర్యవేక్షణలో సిబ్బంది గ్రామంలోని పాడి పశువులకు, ఎద్దు లకు టీకాలు వేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా ఈ టీకాలు వేయడం జరుగుతుందని, రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్, డాక్టర్ సురేందర్ నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సురేందర్ నాయక్

## నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

**ఇబ్రహీంపట్నం, మార్చి 30, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు ఎంఎస్ఎన్ సంస్థ ఆధ్వర్యంలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు చదువుకుంటున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. బిఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కూడా ఈ జాబ్ మేళాకు హాజరుకావడానికి అర్హులని వివరించారు. ఈ మేళాలో ఎంపికైన వారికి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ కంపెనీలు, సంస్థలలో ఆకర్షణీయమైన వేతనంతో కూడిన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఆసక్తి గల ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంత అభ్యర్థులు నేడు మధ్యాహ్నం 1:30 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల మధ్య తమ విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కళాశాలకు హాజరుకావాలని సూచించారు. నిరుద్యోగ యువత ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ డాకర్ ఎస్.రాధిక కోరారు.

## ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం విజయవంతం

**చేవెళ్ల, మార్చి 30, ప్రభాతవార్త:** చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కమ్మేట గ్రామంలో మార్చి 23 నుండి 30 వరకు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం విజయవంతంగా ముగిసింది. వారం రోజులపాటు నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థి వాలంటీర్లు గ్రామ సేవ, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. కాంచనలత, జెడ్‌పిహెచ్ఎస్ కమ్మేట ప్రధానోపాధ్యాయులు జితేందర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి, సేవాభావం మరియు క్రమశిక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. శిబిరం ముగింపు సందర్భంగా నిర్వహించిన వాలెడిక్టరీ కార్యక్రమంలో డా. సి. కాంచనలత విద్యార్థులను అభినందించి, సమాజ సేవలో నిరంతరం పాల్గొనాలని సూచించారు.

# భక్తి శ్రద్ధలతో శ్రీవారి కల్యాణ మహోత్సవం

**షాద్‌నగర్, మార్చి 30, ప్రభాతవార్త :** జానంపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ భక్తులతో కలిసి భక్తి భావంతో తిలకించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆధ్వర్యంలో ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతూ, వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన అంజయ్య యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి కూర్చొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షి స్తూ, స్వామివారి దివ్య కృప ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతి సమృద్ధులతో జీవించాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. భక్తి, నమ్మకం మన జీవన విధానాన్ని మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, గోపాల్, ఎస్పీ శివ మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, కానుగు అనంతయ్య, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి నూతన దుస్తులు తలంబ్రాలను తీసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యేలు



పోలీసుల అదుపులో మలిదశ ఉద్యమకారులు

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**షాద్‌నగర్, మార్చి 30, ప్రభాతవార్త :** ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని రంగారెడ్డి జిల్లా తెలంగాణ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు ఏ శ్రీనివాస్ రెడ్డి, ఉద్యమకారులు సుధాకర్ రవికుమార్ గౌడ్ అధ్యక్షుల రాజు మేకల వెంకటేష్ సునీల్ రెడ్డి శేఖర్ గౌడ్ నరసింహ శంకర్ గౌడ్ తదితరులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణ ఉద్యమకారులను నియోజకవర్గ వ్యాప్తంగా పోలీసులు ప్రభుత్వ ఆదేశాలతో అరెస్టులు చేయడం సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యమ కారులను అనవసరంగా అరెస్టు చేయడం తగదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి బోగస్ అరెస్టులను వెంటనే ఆపేయాలని ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పోలీస్ అధికారుల తీరుపై నిరసన ప్రదర్శించారు. అంతకుముందే పలువురు ఉదయమకారులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు అరెస్టు అయిన వారిలో మాజీ జెడ్పిటిసి వెంకట్రాంరెడ్డి సీనియర్ జర్నలిస్ట్ ఖాజాపాషా సిరాజుద్దీన్ పినపాక ప్రభాకర్ నక్కల వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవీందర్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, మార్చి 30, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా డి. రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన తన ప్రత్యర్థి కె. అరుణ్ కుమార్ పై 54 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 72 ఓట్లకు గాను 58 ఓట్లు పోల్ అవ్వగా.. రవీందర్ రెడ్డి 56 ఓట్లతో గెలుపొందారు. అధ్యక్ష పదవికి ఎన్నిక జరగగా మిగిలిన కార్యవర్గ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఆకల బిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా బాకారం శ్రీనాథ్ రెడ్డి, కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్ యాదవ్, కోశాధికారిగా పి.స్వాతి ఎన్నికయ్యారు. అలాగే క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా పొట్టి గణేష్, లైబ్రరీ సెక్రెటరీగా పల్లె ధనుంజయ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కావ్యకృతి, కె.ప్రవీణ్ ఎన్నికైనట్లు ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దం వెంకటేశం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా సీనియర్ న్యాయవాది అంజన్ రెడ్డి, అసిస్టెంట్ అధికారిగా కె.మల్లేష్ వ్యవహరించారు.





ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

## రూ.10వేల వేతనం అమలు చేయండి

**ఇబ్రహీంపట్నం, మార్చి 30, ప్రభాతవార్త :** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే అరెస్టులు చేయడం దుర్మార్గమని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి వెళ్తున్న కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ముందు కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000 ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని, అలాగే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హక్కుల కోసం పోరాడుతుంటే అరెస్టులతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని, హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, యూనియన్ జిల్లా నాయకులు సరిత, కల్పన, పద్మ, శిరీష, రాధ, పరమేశ్వరి, నరేందర్, సుజాత మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందసేస్తున్న టిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

## రూ.20 వేల ఆర్థిక సాయం అందజేత

**ఇబ్రహీంపట్నం, మార్చి 30, ప్రభాతవార్త :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు ముచ్చర్ల నాగేష్‌కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ బాసటగా నిలిచింది. సోమవారం యూనియన్ రాష్ట్ర నాయకులు జోగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాగేష్‌ను పరామర్శించి, సహచర జర్నలిస్టులు స్వచ్ఛందంగా సేకరించిన రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్బంగా జోగు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న సహచరుడికి అండగా నిలవడం ప్రతి జర్నలిస్టు బాధ్యత అని, నాగేష్‌కు భవిష్యత్తులోనూ అన్ని విధాలా భరోసా ఇస్తామని పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకొని తిరిగి వృత్తిలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పంది వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షులు పల్లాటి జగన్, ఉపాధ్యక్షులు పంది శ్రీను, లింగం తదితరులు పాల్గొన్నారు.



న్యూ సిటీ కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ బస్వం

## కాలనీలో సమస్యలను పరిష్కరిస్తా

**షాద్‌నగర్, మార్చి 30, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా సోమవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ 27 వార్డులో న్యూసిటీ కాలనీలో పర్యటించి కాలనీ సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించిన షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కౌన్సిలర్ మురళీమోహన్, కాలనీవాసి సలీం కాలనీ వాసులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. దశలవారీగా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని ఈ సందర్భంగా చైర్మన్ బసవేశ్వర్ హామీ ఇచ్చారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడివో వినయ్ కుమార్

## అత్వెల్లి గ్రామం అన్నింటా ఆదర్శం కావాలి..

**వికారాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** మండలంలోని అన్ని గ్రామాలకు అత్వెల్లి గ్రామం అన్నింట ఆదర్శంగా ఉండాలని ఎంపీడీవో వినయ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన అత్వెల్లి గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి పై స్థానిక సర్పంచ్ అర్ధ విజయలక్ష్మి మహేందర్ రెడ్డిని అభినందించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతగా చురుకుగా కొనసాగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే తీరుగా ముమ్మందు కూడా అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టి సారించాలని సర్పంచ్ ను కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రూ.10 లక్షల ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో చేపడుతున్న ఓపెన్ వెల్ డ్రైనేజ్, రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.4 లక్షలతో సైడ్ డ్రైన్, రూ.4.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, రూ.10 లక్షలతో మహిళా సమైక్య భవనం, రూ. 10లక్షల తో షెడ్డు నిర్మాణం, రూ.7.2 లక్షలతో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులను ఎంపీడీవో సందర్శించి పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పనుల నాణ్యత, పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో మమేకమై, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ పరిపాలనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అర్ధ విజయలక్షి ్మ మహేందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి పూర్ణిమ, ఉప సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యుత్ జెఎసి రాష్ట్ర నాయకులు

## సమస్యలు పరిష్కరించే వరకు విశ్రమించేది లేదు

**ఇబ్రహీంపట్నం, మార్చి 30, ప్రభాతవార్త :** విద్యుత్ రంగం అభివృద్ధిలో రేయింబవళ్లు శ్రమిస్తున్న ఆర్టిజన్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు విశ్రమించేది లేదు.. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకులు కావలి వెంకటేష్, కె. శివకుమార్ రెడ్డి, పి.రాజు, ఎం.ప్రవీణ్ హెచ్చరించారు. రాష్ట్ర జేసీసీ పిలుపు మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్లు, మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్లు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జేసీసీ రాష్ట్ర నాయకులు కావలి వెంకటేష్, కె. శివకుమార్ రెడ్డి, పి. రాజు, ఎం. ప్రవీణ్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్టిజన్ల పట్ల ప్రభుత్వం, యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయడం సరికాదన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

## ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై అవగాహన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 30, ప్రభాతవార్త :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పొల్యుషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో సే నోటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడటంపై జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కీసర మండలం బోగారంలోని హోలీ ట్రినిటీ ఇన్స్టూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ కాలేజ్‌లో విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించటానికి పాటించాల్సిన నియ మాలు, ప్రత్యామ్నాయ మార్గాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సంబంధిత పర్యావరణ ఇంజనీర్ అధికారులు వివరించారు. సుమారు 60మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన పోస్టర్‌ను ప్రదర్శించారు.

## జాతీయ స్థాయి పోటీల్లో సిఐ జేమ్స్ బాబుకు కాంస్య పతకం

**చేవెళ్ల మార్చి 30, ప్రభాత వార్త:** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌లో ఐటీ సెల్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న సీఐ జేమ్స్ బాబు జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇండియా ఓపెన్ కాంపిటీషన్ (ఎయిర్ రైఫిల్, పిస్టల్) లో కాంస్య పథకం సాధించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు తన కార్యాలయంలో జేమ్స్ బాబును అభినందించారు. విధుల్లో బిజీగా ఉన్నప్పటికీ క్రీడల్లో ప్రతిభ చూపినందుకు ఆయనను ప్రశంసించారు.భవిష్యత్తులో కూడా ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని సీపీ ఆకాంక్షించారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డి

## ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వద్దు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 30, ప్రభాతవార్త :** జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం లేకుండ వెంటనే పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకో వాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సంబంధిత అధి కారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమా వేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్‌రెడ్డితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసి ప్రజలు ప్రజావాణిలో ధరఖాస్తులు చేసు కున్నారు. ఈ ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో 143 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో వ్యయ ప్రయా సలకు ఓర్చి వారి సమస్యలను తెలుపుకోవటానికి కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి వచ్చి విన్నవించుకుంటారని వారి నమ్మకాన్ని సంబంధిత అధి కారులు బాధ్యతగా నిలబెట్టాలన్నారు. ధరఖాస్తుల పరిశీలనలో జాప్యం లేకుండ చూడాలని అన్నారు. తిరస్కరణకు గురైతే వాటికి గల కార ణాలను ఆర్జీదారులకు తెలియజేయాలన్నారు. స్వీకరించిన ధరఖాస్తులను తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు.



వ్యాక్సినేషన్ చేసుకున్న బాలికలకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కలెక్టర్ మనుచౌదరి, పాల్గొన్న డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి

## బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ తప్పనిసరి

**కీసర, మార్చి 30, ప్రభాతవార్త :** జిల్లాలోని రెసిడెన్షియల్ ఇన్సిట్యూట్స్, హాస్టల్స్, స్కూల్స్‌లోని 14-15 సంవత్సరాల వయస్సు గల బాలికలందరికి హెచ్‌పివి వ్యాక్సినేషన్ అందించేలా తగు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. సోమవారం కీసర ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో భవిషత్‌లో గర్భాశయ క్యాన్సర్ నివారణకై బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ అందించే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విచ్చేసి ప్రారంభించారు. వ్యాక్సిన్ ఎంత డోసు ఇస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ తీసుకున్న బాలికలకు కలెక్టర్ హెచ్‌పివి వ్యాక్సినేషన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. జిల్లాలోని ఎస్సీ,బిసి,మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టల్స్, స్కూల్స్‌లోనూ బాలికలకు వ్యాక్సినేషన్ అందించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లా వ్యాప్తంగా 24/7పిహెచ్‌సి ఏవైతే ఉన్నాయో అన్నింటిలోనూ కూడ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తూ అందించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అదనంగా నిధులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. మందుల గదిని పరిశీలించి ఎక్స్‌ఫైర్ డేట్‌ను పరిశీలించి మందులు అందించాలని సిబ్బందికి కలెక్టర్ మనుచౌదరి సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ రాజేశ్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సత్యవతి, కౌశిక్ పిఓ, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ మంజుల, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## కరెన్సీనోట్లపై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలి

**ఘట్‌కేసర్, మార్చి 30, ప్రభాతవార్త:** అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ద్వారానే బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్లు వచ్చి పదవులు సిద్దించాయని అల్లుస్ నిర్మాణ సంస్థ చైర్మన్ అల్లు కమలాకర్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 259వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. బిల్డర్ కమలాకర్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ 60 దేశాల రాజ్యాంగాలను చదివి భారతదేశ వర్ణ వ్యవస్థని, కులవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని దేశ స్థితిగతుల కారణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమలాకర్ అంబేద్కర్ అందించిన సేవలను, పోరాటాలను తెలియజేస్తూ ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం భారత రాజ్యాంగ పీఠికపై అందరూ ప్రమాణం చేశారు.

### నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

**చేవెళ్ల, మార్చి 30, ప్రభాతవార్త:** నీటి గుంతల పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసింది. ఎస్ఐ సంతోష్ రెడ్డి కథనం ప్రకారం హస్తపూర్ గ్రామ పరిధిలో గల ఒక నీటి గుంతలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభించిందన్నారు. మృతునికి మెడలో ఎరుపు రంగు దారంతో ఒక రుద్రాక్ష, నలుపు రంగు మొలతాడు ఉందని, ఎడమ కాలుకు నలుపు రంగు దారం కలదు. కుడి చేతికి ఎరుపు రంగు దారం కలదు. కుడి చేతి మీద పచ్చబొట్టు పొడిచి ఉన్నది నీటిలో నానిన కారణంగా ఏం రాసి ఉన్నది అనేది తెలియడం లేదు. హస్తపూర్ గ్రామపంచాయతీ సెక్రటరీ ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE VII ADDL. METROPOLITAN MAGISTRATE RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR**
**O.S.No. 166 OF 2026**

Between:
**Nayakuti Anjamma & 2 others** ... **Plaintiff**
And
**1. The Tahsildar**
Abdullapurmet Mandal,
Ranga Reddy District
**2. All concerned** ...**Defendants**
To
**All concerned (Defendant No.2)**

**NOTICE**

Please take notice that the above named plaintiffs have filed above suit for declaration to declare the plaintiffs as Legal Heirs and successors to succeed his estate of **Late Nayakuti Ramulu who passed away on 31.07.2021** and for declaration of title in respect of suit schedule property and the matter is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may be appear before this Hon'ble court on **20.04.2026 at 10.30 AM,** either in person are through on advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// By Order of the court //
**Sd/- B. KAMALAKAR**
**K. GOPI SHANKAR**
**Advocates**
# H.No. S140, Sachivalayanagar Colony, Vanasthalipuram, Hyderabad-500 070.
**Ph: 96766 73769**

**PUBLIC NOTICE TO WHOMSOEVER IT MAY CONCERN**

Notice hereby given to the general public that my clients **GADDUM MANMOHAN REDDY S/O. GADDAM VENKAT REDDY AND GADDAM RAJ MOHAN REDDY. S/O. GADDAM VENKAT REDDY** residing at 8-7-96/T/P-2, Flat No.502, Silver Spring Residency, Road No.11, Teachers Colony, B.N. Reddy Nagar, K.V. Rangareddy District, Telangana - 500070 are the sole, absolute, and lawful owner of the property described in the schedule below (hereinafter referred to as the "schedule property").
The subject property was gifted to my clients by his father, **Sri, GADDAM VENKAT REDDY** out of natural love and affection, by way of a Registered Gift Deed dated. 23-10-2024 duly registered as Document No. 12907/2024 at the office of the Sub-Registrar, Champapet.
The public is hereby informed that my clients has never signed any such document, nor authorized any person to deal with the property on his behalf. Any such document is null, void, and non-est in the eyes of the law. The perpetrators of this fraud have no right, title, or interest to sell, mortgage, lease, or create any third-party interest in the subject property.
The general public is hereby cautioned and warned not to enter into any transaction, negotiation, or agreement with any person(s) claiming rights under the aforementioned fraudulent documents. Any person dealing with the subject property base on such unauthorized documents shall do so at their own risk and consequences. My client shall not be liable for any loss, and he reserves the right to initiate both criminal and civil proceedings against such wrongdoers.

**SCHEDULE OF THE PROPERTY**

Non-Agricultural land at Nadargul Village, Ward Block: 0-1 part and parcel of Survey No.806/'A/1 & 806/'A/1/2 admeasuring Ac.4-00 Gts. 16-00., Situated at Revenue Mandal, under Balapur Nadargul Ranga Reddy district, under Sub-Registrar Champapet, Telangana., Boundaries as: North-25 vide Road & Neighbours Plotted Area, South-land in Sy.No 806 part belongs to Ananth Reddy & brothers, East-land of G. Sanjeeva Reddy & G.Krishna Reddy, West-25 vide Road& Neighbours Plotted Area.

**Sd/- B. KIRAN KUMAR**
**Advocate**
Office at H.No.3-12-14/113, Srinivasa Nagar colony, Mansoorabad, L.B.Nagar, Hyderabad, Telangana State.
**Mobile No: 9703998686**



గజమాలతో సన్మానం చేస్తున్న ఎంపిడిఒ,సిబ్బంది

## ఘనంగా ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పదవీ విరమణ వేడుక

**దౌల్తాబాద్,మార్చి 30,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా సేవలందించిన సి.దస్తయ్య పదవీ విరమణ మహోత్సవం కార్యక్రమం సోమవారంరోజు స్థానిక చెన్నకేశవ ఫంక్షన్‌హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీనివాస్,మండల పంచాయితీ కార్యదర్శులు మాట్లాడుతూ..పదవీ విరమణ అనేది ఒక బాధ్యత నుండి విముక్తి మాత్రమేనని,అది జీవితంలో మరొక కొత్త అధ్యాయానికి నాంది అని అన్నారు. దస్తయ్య తన విధి నిర్వహణలో ఎంతో క్రమశిక్షణతో,నిబద్ధతతో పనిచేశారని,కార్యాలయ పనుల్లో ఆయన అందించిన సహకారం మరువలేనిదని,శేష జీవితాన్ని ఆయన కుటుంబ సభ్యులతో హాయిగా గడపాలని వారు ఆకాంక్షించారు.అనంతరం దస్తయ్య దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి,జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు,పంచాయితీ కార్యదర్శులు,ప్రజా ప్రతినిధులు,కుటుంబ సభ్యులు,శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో వసతులు కల్పించాలి

**చౌడపూర్, మార్చి 30, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోనీ అంగన్వాడి కేంద్రాలలో కనీస వసతులు కల్పించాలని ప్రజాదర్బార్‌లో వినతి పత్రాన్ని అందించారు.అంగన్వాడి కేంద్రాలలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని,సమస్యలు పరిష్క రించాలని, సోమవారం ప్రజా దర్బార్ కార్య క్రమంలో ఎంపిడిఒ సోమలింగం, తహసిల్దార్ వెంక టేశ్వర్లు, సూపరిండెంట్ రమేష్‌కు వికారాబాద్ జిల్లా మాలమహానాడు అధ్యక్షులు బి. వెంకటేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మండలంలో అంగన్వాడీ సెంటర్లో కనీస వసతులు త్రాగునీరు ,మరుగు దొడ్లు లేక అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, సెంటర్ కు వచ్చే గర్భిణీ స్త్రీలు ఇబ్బంది పడుతున్నారని, వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో వివిధ సంఘాల నాయకులు బోయిని బాల్ రాజ్ కుమ్మరి రామకృష్ణ, శ్రీను అంజయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సంఘాల నాయకులు

## యువత పుస్తక పఠనం అలవర్చుకోవాలి

**-వెల్‌స్పన్ ఫౌండేషన్ తెలంగాణ సిఎస్‌ఆర్ ప్రతినిధి సురేఖ సూచన**

**చేవెళ్ల, మార్చి 30, ప్రభాతవార్త:** యువత సమయం వృధా చేయకుండా పుస్తక పఠనంను అలవర్చుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ తెలంగాణ సిఎస్‌ఆర్ ప్రతినిధి సురేఖ సూచించారు. సోమవారం వెల్‌స్పన్ ఫౌండేషన్ తెలంగాణ సిఎస్‌ఆర్ ప్రతినిధి సురేఖ కౌకుంట్ల గ్రామ పంచాయతీ అంబేద్కర్ యువజన గ్రంథాలయంకు రెండు సెట్ల పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా వెల్‌స్పన్ ఫౌండేషన్ తెలంగాణ సిఎస్‌ఆర్ ప్రతినిధి సురేఖ మాట్లాడుతూ ఫోన్‌లతో సమయం వృదా అవుతుందని, యువత ఎక్కువగా ఫోన్‌లకు అలవాటు పడకూడదన్నారు. పుస్తకాల పఠనం వలన ఎంతగానో ఉపయోగపడుతుందని, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. వివిధ పోటి పరీక్షలకు పుస్తకపఠనం ఎంతో సహకరిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కౌకుంట్ల సర్పంచ్ మల్లారెడ్డి,పంచాయతీ కార్యదర్శి సునీత, గ్రంథాలయ అధ్యక్షుడు క్రిష్ణా తదితరులు పాల్గొన్నారు.



కౌకుంట్ల గ్రామ అంబేద్కర్ యువజన గ్రంథాలయంకు రెండు సెట్ల పుస్తకాలను అందిస్తున్న వెల్‌స్పన్ ఫౌండేషన్ తెలంగాణ సిఎస్‌ఆర్ ప్రతినిధి సురేఖ

## డయాలసిస్ సేవలు సద్వినియోగం చేసుకోండి

**-చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి**

**చేవెళ్ల, మార్చి 30, ప్రభాతవార్త:** చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో డయాలసీస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి అన్నారు. గత కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా లేక డయాలసీస్ సేవల నిలిచిపోవడంతో వెంటనే చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి స్పందించి సుమారు 50 వేయిల రూపాయలతో వైరింగ్ ఫైప్‌లైన్ పనులను పూర్తి చేసి తిరిగి సోమవారం డయాలసీస్ సేవలు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మున్సి పల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ ,చేయడం మా బాధ్యతగా బావిస్తామని, ప్రభుత్వ అసుపత్రి అభివృద్ధికి తమ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. అసుపత్రిలో ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్య క్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ రాజేంద్రప్రసాద్,సిఐ శ్రీధర్‌భూపాల్,వైస్ చైర్మన్ రాము గౌడ్,కౌన్సిలర్‌లు బండారి శైలజ ఆగిరెడ్డి,మద్దెల శ్రీనివాస్,తాళ్లపల్లి నర్సింలు, క్రిష్ణానాయక్,మాజీ సర్పంచ్ అరుంధతి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో డయాలసీస్ సేవలను ప్రారంభించిన చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి

## చదరంగంలో సత్తా చాటిన జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి

**ప్రశంసించిన ప్రధానోపాధ్యాయులు అజం మొయినుద్దీన్**





**జవహార్ నగర్, మార్చి 30, ప్రభాతవార్త:** అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన చదరంగం పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నాడు. బాలాజీ నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బోయిని అనిల్ ఈ విజయాన్ని సాధించాడు.మార్చి 21, 22 తేదీలలో నిర్వహించిన మూడవ మహారధి ఇంటర్నేషనల్ ఓపెన్ రాపిడ్ చదరంగం టోర్నమెంట్‌లో అనిల్ మొత్తం 9 రౌండ్లలో 5 పాయింట్లు సాధించి మెరుగైన ప్రదర్శన కనబరిచాడు. ఈ విజయంతో పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆజం మొయినుద్దీన్ విద్యార్థి అనిల్‌ను ప్రశంసిస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. అనంతరం ఆయనకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానికులు పాల్గొని అనిల్‌ను అభినందించారు.

## సమాజంలో పౌరులు అందరూ సమానమే

**తల కొండపల్లి , మార్చి 30, ప్రభాతవార్త:**

సమాజంలోని పౌరులందరూ సమానమేనని ప్రతి ఒక్కరు గమనించాలని తలకొండపల్లి మండల డిప్యూటీ తాసిల్దార్ సంతోష్ అన్నారు. సోమవారం నాడు పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో అధికారులు తో కలిసి ప్రజల అందరితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సమానమైన అని, గ్రామంలోని ప్రజలందరూ ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన సూచించారు. గ్రామంలోని దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలో ఎలాంటి వివక్షత చూపించకూడదని అలాంటి వివక్షత చూపించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న, స్థానిక ఎస్సై శేఖర్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్, ఆర్ ఐ శ్రీకాంత్, జి పి ఓ భాగ్యలక్ష్మి, కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు చినుకుంట్ల అంజమ్మ అల్వాల్ రెడ్డి రాజు అంగన్వాడి టీచర్ అంజమ్మ డీలర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం

**నందిగామ,మార్చి 30, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం విజన్ 2047 లక్ష్యంగా వేగంగా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని, ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. సోమవారం నందిగామ మండలం బుగ్గోని గూడలో సర్పంచ్ బుగ్గ సాలయ్య ఆధ్వర్యంలో నిరుపేద మహిళ బుగ్గ లక్ష్మీ రవి ఇందిరమ్మ నూతన గృహాన్ని ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా లేని నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇంటి ద్వారా నెరవేరింది అన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా సామాన్య ప్రజలకు ఆర్థిక ఉపశమనం కలుగుతుంది అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు లక్ష్మీ మాట్లాడుతూ మేము తరబడి పెంకుటిల్లు లో ఉండేవాళ్ళం. వర్షానికి ఇల్లు కురిసేది, గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న మమ్మల్ని పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో మాకు ఇందిరమ్మ ఇల్లు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. మమ్మల్ని గుర్తించి ఇల్లు కట్టించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# రూప్ సింగ్ తండా ఘటనలో విషాదం

**పరిగి, మార్చి 30, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని రూప్‌సింగ్ తండాలో ఆరు రోజుల క్రితం కుటుంబ సభ్యులపై జరిగిన పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన ఘటనలో తీవ్ర విషాదం నెలకొంది. తీవ్ర గాయాలతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రూప్ సింగ్ తండా సర్పంచ్ రమణిబాయి , ఆమె పెద్ద కుమారుడు వెంకటేష్‌లు మృతిచెందారు.రూప్ సింగ్ తండాకి చెందిన హనుమంతుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య నాతి బాయి అనారోగ్య కారణాలతో మృతిచెందింది.రెండో భార్య రమణీ బాయి గ్రామ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది. అయితే నాతిబాయి కుమారుడు అనార్ సింగ్ ,తన తల్లి భీమా డబ్బులకోసం ,ఆస్తి కొరకు తరచూ హనుమంతుతో గొడవలు పడేవాడు.అనార్ సింగ్ ,ఈ నెల 24న అర్థరాత్రి ఇంటికి తాళం వేసి , పైకప్పు నుంచి పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన రమణి బాయి ,వెంకటేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ,పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈ ఘటనలో తల్లి కొడుకులు ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.ప్రస్తుతం నిందితుడు అనార్ సింగ్ రిమాండ్ లో ఉన్నాడు.తండ్రి హనుమంతు కూడా గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



మృతిచెందిన రమణి బాయి, వెంకటేష్ (ఫైల్ ఫోటో)

## మల్కాపూర్ పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం మరువలేనిది

**చేవెళ్ల, మార్చి 30, ప్రభాతవార్త:** మల్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సహకారం మరువలేనిదని మల్కాపూర్ మాజీ ఎంపిటిసి బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. ఎన్‌సిఆర్ ఎటిఎస్‌ఇఓఎస్ ప్రతినిధి సాయి క్రిష్ణా, హెచ్‌ఓవి ఐఎన్‌ఎహెచ్‌ఓఎల్‌ఇ ఫౌండేషన్ ప్రతినిధి నంది, ఎవిఎడి ఇండియా ప్రతినిధి తపన్యలు మల్కాపూర్ పాఠశాలలో సుమారు 12 లక్షల రూపాలతో ఏర్పాటు మౌళిక సదుపాయాలతో పాటు బాలికల కోసం ప్రత్యేంగా టాయిలెట్స్‌ను సోమవారం మల్కాపూర్ మాజీ ఎంపిటిసి బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్బంగా మల్కాపూర్ మాజీ ఎంపిటిసి బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్దులు పడుతున్న ఇబ్బందులను స్వచ్ఛంద సంస్ద ప్రతినిధులకు వివరించగా వారు స్పందించి పాఠశాలలో మరుగుదొడ్లు తదితర వాటిని నిర్మించారన్నారు.ప్రహరి గోడతో పాటు పాఠశాలకు కలర్ బాలురకు, బాలికలకు వెరువెరుగా మరుగుదోడ్లు నిర్మించడ అభినందనీయమన్నారు. పాఠశాల రూపు రెకలు మార్చిన స్వచ్ఛంద సంస్దలు చేసిన మెలు చీరకాలం గుర్తుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పురందాస్, పాఠాశాల మాజీ ప్రదానోపాధ్యాయుడు హన్మంత్‌రెడ్డి,చేవెళ్ల మండల సర్పంచుల సంఘం అద్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,రావులపల్లి సర్పంచ్ రాంచంద్రయ్య, కుమ్మెర గ్రామ ఉప సర్పంచ్ పాండుగౌడ్ ,గ్రామస్తులు శివరాజ్,రవి,మల్లారెడ్డి,గోపాల్‌రెడ్డి,నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గోన్నారు.



మల్కాపూర్ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న మల్కాపూర్ మాజీ ఎంపిటిసి బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి

## అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

**హెచ్చరించిన కాప్రా,తహసిల్దార్ బైరెడ్డి రాజేష్**

**జవహార్ నగర్,మార్చి30, ప్రభాత వార్త:** అక్రమ నిర్మాణాల కూల్చివేతలను సోమవారం రోజున జవహార్ నగర్. సర్వేనెంబర్ 375. సంతోష్ నగర్ కాలనీ సర్వేనెంబర్ 429 అనుమతులు లేని పిల్లర్లు. వజ్రం నగర్ కాలనీ 478 సర్వేనెంబర్. ఒక గది. సర్వే నెంబర్ 22 వైయస్సార్ నగర్ కాలనీలో ఒక గది నిర్మాణాలను కాప్రా మండల తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ. సిబ్బందితో అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.



ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మోకిలా పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

## గంజాయి పట్టివేత
### కేసు నమోదు

**శంకర్‌పల్లి, మార్చి 30, ప్రభాతవార్త :** అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను మోకిలా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. శంకర్ పల్లి మండల జన్వాడ గ్రామ పరిసరాల్లో గంజాయి విక్రయిస్తున్నారన్న పక్క సమాచారంతో మోకిలా పోలీసులతోపాటు ఎస్‌ఓటి బృందం సంయుక్తంగా తనిఖీలు చేపట్టగా ముగ్గురు వ్యక్తులు గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారన్నారు. మీర్జాగూడ వైపు నుంచి వచ్చిన మారుతి సుజుకి సియాజ్ కారును నిలిపి తనిఖీ చేయగా 39.72 గ్రాముల కొకైన్, 3 గ్రాముల గంజాయి, 4 మొబైల్ ఫోన్లు లభించాయన్నారు. కారును సీజ్ చేసి నిందితులు పొన్నాల సిద్ధార్థ్, చలవాది హిమంత్ కృష్ణవంశీ, అవధూత విష్ణు తేజ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఎర్రరాయి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసునమోదు



ఎర్రరాయిని తరలిస్తున్న ట్రాక్టర్

**పెద్దేముల్, మార్చి 30, ప్రభాతవార్త:** అనుమతులు లేకుండా అక్రమంగా ఎర్రరాయి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తెలిపారు. ఈ సందర్బంగా ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ మాట్లాడుతూ పెద్దేముల్ మండలం రాంసింగ్‌తాండా నుంచి అక్రమంగా ఎర్రరాయిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా ఎర్రరాయి, ఎర్ర మట్టి తవ్వకాలు చేపట్టిన, అక్రమంగా రవాణ చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సంసారంలో మద్యం చిచ్చు

**భార్య మందలింపుతో భర్త ఆత్మహత్య**

**ఘట్‌కేసర్, మార్చి 30, ప్రభాతవార్త:** మద్యానికి బానిసై నిత్యం తాగి వస్తున్నావంటూ భార్య మందలించడంతో తీవ్ర మనస్థాపం చెంది భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ బుగ్గానగర్‌కు చెందిన పస్నీరు నర్సింహ్మ (45) నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండటంతో భార్యతో తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో నర్సింహ్మ సోమవారం ఉదయం మద్యం తాగి ఇంటికి రాగా భార్య మందలించగా మనస్థాపం చెంది ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య, స్థానికులు గమనించి ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు.

## సంస్కృతి ఫార్మసీలో సిసిఎస్ఈఏ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు

**ఘట్‌కేసర్, మార్చి 30, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్ సంస్కృతి ఫార్మసీ కళాశాలలో 'జంతు పరిశోధనలో నైతిక సవాళ్లు-సంక్షేమం, నియంత్రణపై మారుతున్న దృక్పథాలు' అనే అంశంపై ఉన్నత స్థాయి వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారు. సీసీఎస్ఈఏ సహకారంతో జరిగిన సదస్సులో ప్రముఖ సిసిఎస్ఈఏ సభ్యుడు-నేషనల్ అనిమల్ రిసోర్స్ ఫెసిలిటి ఫర్ బయోమెడికల్ రీసెర్చ్ (ఎన్ఏఆర్ఎఫ్‌బిఆర్) మాజీ డైరక్టర్-ఇంచార్జ్ డాక్టర్ సురేశ్ పొతాని ముఖ్యఅతిధిగా హాజరై జంతు ప్రయోగాల్లో అనుసరించాల్సిన సిసిఎస్ఈఏ నియమాలపై ప్రసంగించారు. వివిధ కళాశాలల నుంచి 286 మంది ఫార్మసీ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ జంతు సంక్షేమం, నియంత్రణ సంస్థల పాత్ర, ప్రత్యామ్నాయ పరిశోధనా పద్ధతులపై సమగ్ర చర్చ నిర్వహించారు. ప్రసంగాల అనంతరం విద్యార్థులతో పరస్పర చర్చ నిర్వహించి వారి సందేహాలను నివృతి చేశారు. సిసిఎస్ఈఏ మార్గదర్శకాలను పాటించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అతిథి ప్రసంగకులు డాక్టర్ బి.వసుధభక్షి, డాక్టర్ పి.శైలజ, డాక్టర్ ఎ.సతీష్‌చంద్రలు మాట్లాడుతూ జంతు ప్రయోగాల్లో నైతిక ప్రమాణాలు, ఔషధ అభివృద్ధిలో జంతు వినియోగం, పరిశోధనలో అనుసంచరించాల్సిన సాంకేతిక అంశాలపై వివరించారు. కళాశాల చైర్మన్ ఎవి.రమణారెడ్డి, డైరక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రావణ్‌కుమార్‌లు పాల్గొనగా ఐక్యూఎసి విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.స్వాతి సమన్వయకర్తగా వ్యవహరించారు.

## ఇండ్లకు సిమెంట్ పంపిణీ చేసిన సర్పంచ్

**తలకొండపల్లి మార్చి 30,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో నిరుపేదలైన ఇండ్ల లబ్ధిదారులకు శనివారంనాడు గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న, తోపాటు కాంగ్రెస్‌పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సిమెంటు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బోయ రాములు బోయ మల్లన్నలకు ఇండ్లు సిమెంట్ చేసుకునేందుకుగాను ఉచితంగా సిమెంట్ బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీమండల అధ్యక్షులు గుజ్జుల మహేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, నాయకులు శేఖర్ వెంకటరాజు రెడ్డి రమేష్ రామచంద్రయ్య శేఖర్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

**వెంకటాపూర్ లో**

తలకొండపల్లి మండలపరిధిలోని వెంకటాపూర్ గ్రామము లోని తాంద్ర వెంకయ్య అనే నిరుపేదకు ఇంటి నిర్మాణానికి సర్పంచ్ బుజూరి పుష్పమ్మ అంజన్ రెడ్డిల ఆధ్వర్యంలో సిమెంట్ బస్తాలు అందించారు.ఉప్పల చారిటబుల్ ట్రస్టు నుంచి ఉచితంగా ఇంటి మరమ్మతులకు సిమెంటు అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పలట్రస్టు నుంచి నిరుపేదవారిని ఆదుకుం టామన్నారు.ఈ కార్యక్రమములో సర్పంచ్ బురుజు పుష్పమ్మ అంజన్ రెడ్డి,ఉప సర్పంచ్ చంద్రశేఖర్, మహేష్, మల్లేష్, శేఖర్,ఇందిరమ్మ,లాలయ్య,శ్రీను,పావని,శివ కుమార్ గౌడ్ ఉన్నారు.

## రైతులు రుణాలు సకాలంలో చెల్లించాలి

**సహకార సంఘం ప్రత్యేక అధికారి ఎం రవికుమార్**





సమావేశంలో మాట్లాడుతున్న సహకార సంఘం ప్రత్యేక అధికారి

**యాచారం,మార్చి 30, ప్రభాతవార్త:** యాచారం మండల ప్రాథమిక వ్యవసాయ సహకా సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. రైతులు సహకార సంఘంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సంఘం ప్రత్యేక అధికారి రవికుమార్ అన్నారు.సహకార సంఘం కార్యాలయంలో రైతులతో సర్వసభ్య సమావేశం సిఇఒ నాగరాజు అధ్యక్షతన వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సంఘం ప్రత్యేక అధికారి రవికుమార్ మాట్లాడుతూ.. వాయిదా మీరిన దీర్ఘకాలిక రుణాలను చెల్లించని రైతులకు లీగల్ నోటీసులు ఇచ్చి1964 యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. యూరియా యాప్ ద్వారా కాకుండా మాన్యువల్‌గా కూడా ఇవ్వాలని రైతులు అడగ్గా సాధ్యం కాదని ఎవరైనా సరే ఈ యాప్ లోనే బుక్ చేసుకోవాలని ఏవో రవినాథ్ అన్నారు.మాల్‌లో ఉన్న 300 గజాల స్థలంలో భవనం నిర్మించి ఎరువులు విత్తనాలు సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్వల్పకాలిక రుణాలు తీసుకున్న రైతులు ఆరు నెలల వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. సంవత్సరం వాయిదా దాటితే 7 శాతం నుండి 13 శాతం పెరుగుతుందని అన్నారు. సంఘంలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్న రైతులవి ఆమోదించాలని నిర్ణయించామని అన్నారు. సంఘంలో బంగారు ఆభరణాలపై తక్కువ శాతం వడ్డీ తో రుణాలు ఇస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. లాకర్ సదుపాయాలను వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మి, సర్పంచులు మస్కు అనిత, కేశమోని రాజు, దేరంగుల శంకర్, నీలం ఝాన్సీ, ఉప సర్పంచ్ మంగ, రైతులు పాల్గొన్నారు.

## హెచ్.పి.విపై అవగాహన అవసరం



టీకా వేస్తున్న దృశ్యం

**మొయినాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :** హెచ్.పి.వి(హ్యూమన్ పాపిలోమా వైరస్)పై అవగాహన అవసరమని చేవెళ్ల డివిజన్ వైద్యాధికారి అన్నపూర్ణ, మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సోనియా దర్శన్ అన్నారు. సోమవారం హ్యూమన్ పాపిలోమా వైరస్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వ్యాపించిన వైరస్‌లలో ఒకటిగా వైద్య నిపుణులు చెబుతున్నారని, ఇది ప్రధానంగా చర్మంచర్మం సంబంధం ద్వారా వ్యాపిస్తుందని, ముఖ్యంగా లైంగిక సంబంధాల ద్వారా సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రత్యేకంగా మహిళల్లో హెచ్.పి.వి వల్ల గర్భాశయ గర్భద్వార క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నందున, సమయానికి పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారన్నారు. బాలికలు, యువతులు నిర్దిష్ట వయస్సులో ఈ టీకా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. శుభ్రత, ఆరోగ్యకర జీవనశైలి, మరియు సురక్షిత ప్రవర్తన పాటించడం ద్వారా హెచ్.పి.వి సంక్రమణను కొంతవరకు నివారించవచ్చని తెలిపారు. ఈ వైరస్‌పై అవగాహన పెంచడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాం తక వ్యాధులను ముందుగానే అరికట్టవచ్చని ఆరోగ్య శాఖ పిలుపు నిచ్చింది.

# దేవరయాంజాల్‌లో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి వారు సూర్యప్రభ సేవా ఊరేగింపులో పాల్గొన్న నిర్వాహకులు, భక్తుల దృశ్యం



దేవరయాంజాల్ రామాలయాన్ని గత నలపై ఏళ్లకిందట సందర్శించిన బ్రిటన్ రెండవ మహారాణి ఎలిజబెత్ ఫోటోను రూపొందించి దేవస్థానంకు బహూకరించిన మోటె సురేశ్ దృశ్యం

**శామీర్‌పేట, మార్చి 30, ప్రభాతవార్త:** దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి సూర్యప్రభసేవా ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. సోమవారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవయాంజాల్ రామాలయం బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీసీతారామ చంద్రస్వామి సూర్యప్రభ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో వీరేశం పర్యవేక్షణలో దాతల సహకారంతో బ్రహ్మోత్సవ కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కందాళ సీతారామచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత శ్రీస్వామి వారు సూర్యప్రభ వాహనంపై అలంకరించి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు హారతులు పట్టి భజనలతో ముందు కు సాగారు. పలువురు దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్‌లు పెండెం లక్ష్మినారాయణ,దాసరి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచు గోల్డ్ శ్రీనివాస్, బిజెపి మున్సిపల్ అధ్యక్షులు పి.నర్సింహ్మారెడ్డి, మాజీ ధర్మకర్తలు ఎల్లంకి భారతి, పి.యాదగిరి, ఎస్.రామారావు, బి.అనంతరెడ్డి, బి.జంగారెడ్డి, నాళ్ల చెరువు శంకరప్ప, ఎం.సాయికుమార్, బి.నరేందర్‌రెడ్డి, కొడె కుమార్,శశిధర్‌రెడ్డి, బి.నవీన్, మహిళలు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**శామీర్‌పేట, మార్చి 30, ప్రభాతవార్త**

దేవరయాంజాల్‌కు పూర్వం నుంచి మంచి గుర్తింపు చరిత్ర కలిగి ఉంది. గత 43సంవత్సరాల కిందట (1983నవంబరు 20వ తేదీన) శామీర్‌పేట మండలంలోని దేవరయాంజాల్ గ్రామానికి బ్రిటన్ మహారాణి రెండవ ఎలిజబెత్ విచ్చేసి రామాలయాన్ని సందర్శించటం జరిగింది. అయితే దేవరయాంజాల్ గ్రామాన్ని సందర్శించిన ఆమె రామాలయాన్ని కూడ సందర్శించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆ కాలానికి చెందిన ఫోటోను తిరిగి రూపొందించి దేవాలయానికి మోటె నర్సింహ్మా కుమారుడు మోటె సురేశ్ దేవస్థానంకు ఆ చారిత్రాత్మక ఘట్టం ఫోటోను ఆయన అందజేశారు. దేశంలోనే దేవరయాంజాల్ గ్రామాన్ని ఎంపిక చేసుకుని నాడు బ్రిటన్ మహారాణి రెండవ ఎలిజబెత్ రాణి సందర్శించటం చరిత్రలో నిలిచింది. గ్రామానికి చెందిన పలువురు నాటి ఆ ఫోటోను చూసి ఎలిజబెత్ రాకను స్మరించుకున్నారు. ఆమె గ్రామాన్ని సందర్శించటం వల్ల నాడు ప్రభుత్వం గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించిందని గ్రామానికి 43ఏళ్ల కిందట బిటి రోడ్డును కూడ వేయించారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. ఈ ఫోటో భవిషత్ తరాలకు చారిత్రక స్మృతిగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. దేవాలయ చరిత్రలోనే మహారాణి సందర్శన ఒక విశేష ఘట్టంగా నిలిచిందని చెప్పవచ్చు. ఈ ఫోటో బహుకరణ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ పెండెం లక్ష్మినారాయణ, దాసరి గోపాల్‌రెడ్డి, పన్నాల సుదాకర్‌రెడ్డి, పన్నాల వీరారెడ్డి, మాజీ ధర్మకర్త మురళీగౌడ్, బిజెపి అధ్య క్షులు పి.నర్సింహ్మారెడ్డి, అర్చకులు సీతారామాచార్యులు, భక్తులు పి.ధర్మారెడ్డి, కట్ట శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





దేవర యాంజాల్ రామాలయంను సందర్శించిన (ఫైల్‌ఫోటో) నాటి చిత్రాన్ని రూపొందించిన ఫోటో దృశ్యం



బిజెపి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న నేతలు 1

## కేంద్ర ప్రభుత్వం పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

**బిజెపి జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్‌రావు**

**కుల్కచర్ల,మార్చి 30, ప్రభాతవార్త:** కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బిజెపి జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణలో మహభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని బిజెపి మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ అధ్వర్యంలో విజయచంద్ర ఫంక్షన్‌హాల్‌లో పరిగి నియోజక వర్గంలో ఉన్న ఆయా మండలాల బిజెపి నేతలు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఈ విషయాన్ని ప్రజలోకి తీసుకేళ్ళాలన్నారు.ప్రతి కార్యకర్త సైనికులవలె పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టెలికాం అడ్వైజర్ కమిటి నెంబర్ వెంకటయ్య గౌడ్,దిశా కమిటి మెంబర్ జానకి రామ్ చౌహన్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాటన్‌పల్లి ఆంజిలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు యాదయ్య, కేశావులు, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్, బంధయ్య, సురేష్, ఎస్సి మోర్చా అధ్యక్షులు ఆంజనేయులు, హరికృష్ణ, మలేష్, అయా గ్రామాల బూత్ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి

తహసీల్దార్‌కు వినతి



మేడ్చల్ తహసీల్దార్ భూపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ గణేష్

**మేడ్చల్, మార్చి 30, ప్రభాతవార్త :** మేడ్చల్ సర్కిల్‌లోని పూడూర్ కిష్టాపూర్ డివిజన్‌పరిధిలో కబ్జాకు గురి అవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ మేడ్చల్ తహసీల్దార్ భూపాల్‌కు మాజీ కౌన్సిపల్ గణేష్ ఫిర్యాదు చేశారు. డివిజన్ పరిధిలో సర్వేనెంబర్ 665, 786 లో గల ప్రభుత్వ భూమిలో కొంతమంది కబ్జా చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేరొన్నాడు. వెంటనే విచారణ జరిపించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

## ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం

**మేడ్చల్, మార్చి 30, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలో పద్మ శ్రీనివాస్‌లు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారిగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నదని ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ, నాయకులు శివకుమార్, సంతోష్ గౌడ్, పానుగంటి మహేష్ కుమార్, రాకేష్ వంజరి, శ్రీధర్ కురుమ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

## హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం

**మేడ్చల్, మార్చి 30, ప్రభాతవార్త :** దళిత ఎమ్మెల్యేల మీద అనుచిత వాఖ్యలు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఎ బ్లాక్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్ మాటాల్డుతూ అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత మంత్రి వివేక్ వెంకటస్వామిని, వరంగల్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, సిఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బిఆర్ఎస్‌కు చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వాఖ్యలు చేస్తూ తుపాకీతో కాల్చేస్తాను సైగలు చేయడం అయన ఆహంకారానికి నిదర్శనమని ఆరోపించాడు. వెంటనే ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేని ఎడల పాడి కౌశిక్ రెడ్డి అనే పిచ్చోడిని ఎక్కడ తిరిగిన చెప్పుదెబ్బలు తప్పదని హెచ్చరించాడు.ఇప్పటికైనా తన ధోరణిని మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నాడు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివ శంకర్ ముదిరాజ్, ఒబిసి సెల్ జిల్లా అధ్యక్షుడు రవి ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు చాప రాజు, దేవరాజు, కొడే మహేష్, నాయకులు రాఘవేందర్ గౌడ్, సంతోష్ గౌడ్, మోహన్, నరేందర్, మహిళా అధ్యక్షురాలు ప్రేమలత, నడికోప్పు రంజిత్, రామస్వామి ముదిరాజ్, బాల మల్లేష్, నవీన్, రాకేష్, శ్రీధర్, ఆరిఫ్, వినోద తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య**

**దుద్యాల్, మార్చి 30, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చవద్దని తదనుగుణంగా గ్రామపంచాయతీ తీర్మానం చేయాలని గ్రామ సర్పంచ్ సంగీతవాణికి సిఐటియు నాయకులు, కూలీలు వినతి పత్రాన్ని అందజేశారు. కేంద్రంలోని బిజెపిప్రభుత్వం ఎంజి ఎన్ఆర్ఇజిఎస్‌ను విబిజిరాంజిగా మార్చడం సబబు కాదన్నారు. జాతిపిత అయిన మహాత్మాగాంధీ పేరును కొనసాగిస్తూ సంవత్సరానికి 125 రోజులు ఉపాధి కల్పించాలని తదనుగుణంగా గ్రామపంచాయతీ తీర్మానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



## సివిఎంసి కమిటీ మండల అధ్యక్షులుగా మిన్నాల దామోదర్

**తలకొండపల్లి, మార్చి30,ప్రభాత వార్త:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో నూతన సివిఎంసి కమిటీని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల కుల సంఘాలు, రాజకీయ నాయకులు, వృత్తిదారులు, వ్యవసాయ కూలీలు, జర్నలిస్టులు, అడ్వకేట్స్ ,వివిధ రంగాల చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి జోగు రమేష్, పీపుల్స్ యాక్షన్ రూరల్ అవేగ్నింగ్ కార్యకర్త మాట్లాడుతూ సివిఎంసి కమిటీ ఎస్సి, ఎస్టి ,బిసి మైనార్టీలకు ప్రభుత్వ పరంగా రావాల్సినటువంటి పథకాలు అలాగే వారిపైన అక్రమంగా అన్యాయంగా దాడులు జరిగిన వారి యొక్క హక్కులను హరించినటువంటి సందర్భాలలో వాళ్లకు న్యాయం జరిగేంతవరకు చట్టపరంగా ఈ యొక్క కమిటీ పని చేస్తుందని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమానికి మండలంలోని వివిధ నాయకులు 50 మంది వరకు పాల్గొన్నారు.

## గడ్డ మల్లయ్య గూడలో రైతులకు అవగాహన

**యాచారం, మార్చి 30, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని గడ్డ మల్లయ్య గూడ గ్రామంలో ని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంలో ఆసక్తి కలిగి ఎన్నికైన రైతులకు జాతీయ ప్రకృతి వ్యవసాయ కమిషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమం రెండు సంవత్సరాలు పూర్తి సందర్భంగా రైతులకు సమగ్ర అభివృద్ధి నిర్వహించారు. కార్యక్రమంలో మట్టి నమూనాల సేకరణ, పరీక్ష ఫలితాలపై వివరణ, విత్తనాల ఎంపిక, ప్రకృతి వ్యవసాయంలో వాడే సేంద్రియ ఎరువులు, బీజామృతం, జీవామృతం నీమాసారం, రైతు దర్శిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ అచ్చన్న మంగజంగయ్య, వార్డు సభ్యులు, మండల వ్యవసాయ అధికారి రవినాథ్, రైతులు,తదితరులు పాల్గొన్నారు.



గడ్డ మల్లయ్య గూడెంలో పాల్గొన్న సర్పంచ్, ఉప సర్పంచ్ వ్యవసాయ అధికారులు రైతులు

## కత్తితో దాడి చేసిన నిందితుడు వడ్డే రమేష్ అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు

**ధారూర్, మార్చి 30, ప్రభాత వార్త:** ధారూర్ మండల పరిధిలోని నాగసాన్‌పల్లి గ్రామంలో మద్యం మత్తులో ఇద్దరు యువకులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి పరారీలో ఉన్న నిందితుడు వడ్డే రమేష్‌ను పోలీసులు పట్టుకున్నారు. శనివారం సాయంత్రం పొలం వద్ద పనిలో ఉన్న నాగార్జునపై, అతడిని కాపాడబోయిన మహిపాల్‌పై రమేష్ దాడికి తెగబడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గాయపడిన వారు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటన జరిగినప్పటి నుండి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వడ్డే రమేష్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ తెలిపారు.

## విద్యార్థుల్లో గర్భాశయ క్యాన్సరు నివారణకు ప్రభుత్వం కృషి

**షాబాద్, మార్చి 29, ప్రభాతవార్త :** విద్యార్థుల్లో గర్భాశయ క్యాన్సరు నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలచైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ ప్రాథమిక ఆసుపత్రిలో హెచ్‌పివి వాక్సిన్ను 14 సంవత్సరాల బాలికలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ టీకావలన ఇది భవిష్యత్తులో వచ్చే గర్భాశయ క్యాన్సర్ను నివారిం చడంలో కీలకపాత్ర పోశిస్తుందన్నారు. చిన్న వయసులోనే ఈ టీకా ఇవ్వడం వల్ల శరీరంలో రోగనిరోధకశక్తి మెరుగ్గా పనిచేస్తుం దన్నారు.

## పేద విద్యార్థులకు ఎంపి కొండంత అండ



పేద విద్యార్థులకు చెక్కులు అంద జేస్తున్న బిజెపి నాయకులు

**కుల్కచర్ల,మార్చి 30, ప్రభాతవార్త:** చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి పేద విద్యార్థుల చదువులకు చేయూనిచ్చి కొండంత అండగా నిలుస్తున్నరని దిశా కమిటి అడ్వైజర్ జానకి రామ్ చౌహన్ అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి పురస్కరించుకొని ప్రతి సంవత్సరంలాగే పేద విద్యార్థులకు స్థానిక నాయకులతో కలిసి చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు, పేద ప్రజలకు చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి విద్య పట్ల, వైద్య పట్ల అనేక కార్యక్రమాలు చేపడుతున్నరని అన్నారు.

ఈ కార్యక్రమంలో టెలికాం అడ్వైజర్ కమిటి నెంబర్ వెంకటయ్య గౌడ్,సినియర్ నాయకులు హారికృష్ణ,ఉపాధ్యక్షులు కొండ ఆంజనేయులు, కేశావులు, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్, బంధయ్య, రాంచద్రయ్య, సురేష్, ఎస్సి మోర్చా అధ్యక్షులు ఆంజనేయులు, మలేష్, అయా గ్రామాల బూత్ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు న్యాయ సేవలు అందించాలి

**-న్యాయ వాదులు సత్సంబాలు మెరుగు పరుచుకోవాలి**

**-చేవెళ్ల బార్ అసోసియోషన్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం**

**-జిల్లా అదనపు న్యాయమూర్తి బృంగి శ్రీనివాసులు సూచన**



చేవెళ్ల కోర్టులో చేవెళ్ల బార్ అసోసియోషన్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న న్యాయవాదులు



స్వీట్లు తినిపించుకుంటున్న ఆమనగల్ బార్ అసోసియేషన్ సభ్యులు

**చేవెళ్ల, మార్చి 30, ప్రభాతవార్త:** పేద ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు న్యాయవాదులు ముందుండాలని, ప్రతి ఒక్కరితో న్యాయవాదులు సత్సంబంధాలను మెరుగు ఎ జిల్లా అదనపు న్యాయమూర్తి బృంగి శ్రీనివాసులు సూచించారు. సోమవారం చేవెళ్ల కోర్టు అవరణలో జిల్లా అదనపు న్యాయమూర్తి బృంగి శ్రీనివాసులు, సీనియర్ సివిల్ న్యాయమూర్తి దశరథ రామయ్య,జూనియర్ సివిల్ న్యాయమూర్తి విజయకుమార్ ఉపాధ్యాయల సమక్ష్యంలో చేవెళ్ల బార్ అసోసియోషన్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం చేసింది.ఈ సందర్భంగా జిల్లా అదనపు న్యాయమూర్తి బృంగి శ్రీనివాసులు మాట్లాడుతూ కక్షిదారులకు సత్వరన్యాయ సేవలు అందించేందుకు న్యాయ వాదులు ముందుకు రావాలన్నారు.ప్రతి ఒక్కరితో నూతన పాలకవర్గం మంచి సత్సంబంధాలను కల్గిఉండాలన్నారు.న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగే విధంగా బార్ అసోసియోషన్ నూతన పాలక వర్గంతో పాటు బార్ సభ్యులు పని చేయాలన్నారు. సినియర్ న్యాయవాది రాంరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని చేవెళ్ల కోర్టుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, సుమారు 40 సంవత్సరాల క్రితం మున్సిఫ్ కోర్టుగా నలుగురు న్యాయవాదులతో ఏర్పడిన కోర్టు ప్రస్తుతం జిల్లా కోర్టుగా ఏర్పడి 151 మంది సభ్యులతో నడువడం గర్వకారణమన్నారు.రానున్న రోజుల్లో చేవెళ్ల ప్రాంతం మరింతగా అభివృద్ధి చేందుతుం దన్నారు.నూతనంగా ఎన్నికైన పాలకవర్గంను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల బార్ అసోసియోషన్ అధ్యక్షుడు పాటి మదుసూదన్‌డ్డి,ఉపాధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్,ఎన్ మాధురి, జనరల్ సెక్రటరి పి.మలేష్ యాదవ్,జాయింట్ సెక్రెటరి ఈ.రవీందర్‌రెడ్డి,ట్రెజరర్ ఈ.జనార్దన్,స్పోర్ట్స్ అండ్ కల్చరర్ సెక్రెటరి ఏ.ప్రభాకర్‌రెడ్డి,లైబ్రేరియన్ టి.మహేష్,టేడి రిప్రెసెంటెటీవ్ ఈ.కవిత, ఎగ్జిక్యూటివ్ కమిటి మెంబర్స్ ఎం.మహేష్,కె.సుదర్శన్, బి.అనంద్, సి.ప్రవిణ్‌రెడ్డి, కె.ప్రవిణ, బి.మనిషారెడ్డి న్యాయవాదులు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో న్యాయవాదుల సంబురాలు**

**ఆమనగల్లు, మార్చి 30, ప్రభాతవార్త:** అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు తెలంగాణ రాష్ట్ర మండలి ఆమోదం తెలపడం పట్ల ఆమనగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లును ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండె కార్ యాదిలాల్ ఆధ్వర్యంలో సోమవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులంతా సంబరాలు నిర్వహించారు. ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకుని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అండె కార్ యాదిలాల్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, హత్యలు, పోలీసుల దౌర్జన్యాలను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్రంలో రక్షణ చట్టాన్ని అమలు చేయాలని న్యాయవాదులు పోరాటాలు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. న్యాయవాదుల రక్షణ పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఎంపీ మల్లు రవి, . ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్తశుద్ధిపట్ల ఆమనగలు బార్ అసోసియేషన్ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, న్యాయవాదులు రామకృష్ణ, శేఖర్, విజయ్ కుమార్ గౌడ్, గణేష్ గౌడ్, కొప్పు కృష్ణ, సంతోష్, మధు గౌడ్, మల్లేష్, దేవేందర్, శేఖర్, సర్దార్ నాయక్, ప్రభు నాయక్, ఆంజనేయులు, రాజు, మహేష్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో మేలు

**కుల్కచర్ల,మార్చి 30, ప్రభాతవార్తన:** ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సర్పంచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుసుమసముద్రం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిర కేంద్రం నిర్వహించారు.గ్రామ ప్రజలకు వైద్యులు కంటి పరిక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

మరి కొందిరికి ముత్యబిందు (కాటరాక్ట్) శస్త్ర చికిత్స అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...గ్రామీణ ప్రజలకు కంటిచూపుతో ఇబ్బందులు పడుతున్నారని వారి కోసమే ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వైద్యులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న సర్పంచ్

## అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుపై కసరత్తు

**ఆమనగల్లు, మార్చి 30, ప్రభాతవార్త:** నాలుగు మండలాల ముఖ్య కూడలి ఆమనగల్లు పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌కు ఆశాఖ స్పందించింది. సోమవారం ఎస్ ఎఫ్ ఓ నాగరాజు ఆమనగల్లు పట్టణంలో పర్యటించి పలు ప్రభుత్వ శాఖల అధికారులతో చర్చలు జరిపారు. కాగా ఈ ప్రాంతంలో తరచు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో స్థానిక శాసన సభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోగా ప్రభుత్వం స్పందించినట్లు తెలుస్తుంది. కాగా ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడుగుల మండలాల సరిహద్దు గ్రామాలకు అగ్నిమాపక కేంద్రం సేవల ఆవశ్యకతపై కేఎన్ఆర్ సేవాదళం గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన విషయం అందరికీ తెలిసిందే.అలాగే సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా ఎస్ ఎఫ్ ఓ నాగరాజును కలుసుకొని ప్రజల డిమాండ్ విషయాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.



అధికారితో మాట్లాడుతున్న మెకానిక్ బాబా

## 100 అక్షరాస్యత సాధించాలి

**సర్పంచ్ ఇమ్మడి మహేష్**

**తలకొండపల్లి మార్చి 30, ప్రభాతవార్త:**తలకొండపల్లి మండలంలోని వెంకట్రావుపేట్ గ్రామంలో నిరక్షరాశులు 100 అక్షరాస్యత సాధించాలని సర్పంచ్ ఇమ్మడి మహేష్ అన్నారు. ఆదివారం నాడు నవభారత సాక్షరత్ కార్యక్రమంలో భాగంగా వెంకట్రావు పేట గ్రామంలో లోని స్థానిక పాఠశాల ఆవరణంలో నిరక్షరాశులకు ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రానికి ఆయన స్వయంగా హాజరైనారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇమ్మడి మహేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అక్షరాస్యత సాధిస్తే గ్రామం అభివృద్ధి వైపు దూసుకెళుతుందని, తమ గ్రామంలోని నిరక్షరాస్యులను 100 అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పరీక్ష రాసేందుకు ఉత్సవం చూపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇమ్మడి మహేష్, మండల క్లస్టర్ కోఆర్డినేటర్ రాములు, బుక్ కీపర్ అరుణ, ఉప సర్పంచ్ ప్రశాంత్, మాజీ సర్పంచ్ ముకురాల లక్ష్మమ్మ, వార్డు సభ్యులు సంతోష రాజు తోట శీను గువ్వ శంకరయ్య కానుగుల భాగ్యమ్మ యాదమ్మ మహిళా సంఘం నాయకులు సంతోష కౌసల్య ధనమ్మ పూజ మానస తో పాటు పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**లింగారావుపల్లిలో**

తలకొండపల్లి మండల పరిధిలోని లింగారావు పల్లి గ్రామములో నిర్వహించిన నవభారత సాక్షరత పరీక్ష విజయవంతమైంది.ఈ సందర్భంగా సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.18 నుంచి 50 సంవత్సరాల వయసు గల నిరక్షరాస్యులతో మాట్లాడారు.ఆయన మాట్లాడుతూ విద్యతో ఎన్నో లాభాలున్నాయన్నారు.ప్రతి ఒక్కరు చదువుకుంటే సమాజంపై అవగాహన ఉంటుందన్నారు. గ్రామాలలో అక్షరాస్యత పెంచటమే దీనిఉద్దేశం అన్నారు.ఈ కార్యక్రమములో సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ బొత్కూరి వెంకటరెడ్డి,వార్డు సభ్యులు బొచ్చుపల్లి శేఖర్,బండ గాల్లజంగయ్య,భాగ్య,శ్రీజ,ఇమిడి స్వాతిక,రబ్బానీ, శ్రీశైలం, విజయ కుమార్,జన్య, రాములమ్మ ,చెన్నమ్మ,లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## పేదింటి ఇంటి నిర్మాణానికి పల్లె బ్రదర్స్ చేయూత

**కేశంపేట ,మార్చి 30, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వట్టెల నరేష్‌కు ఇందిరమ్మఇల్లు ప్రభుత్వం ద్వారా మంజూరైనది. కానీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని నిర్మించుకునేందుకు నరేష కు ఆర్థిక స్తోమత లేకపోవడంతో తను పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గ్రహించిన పల్లె బ్రదర్స్ అయినా పల్లె ఆనంద్ కుమార్, పల్లె బాలేశ్వర్‌లు నరేష్ నిర్మించుకునే ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయంగా 50వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వంలో నిరుపేదలైన ప్రజలకు అందించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని త్వరతగతన పూర్తి చేసుకోవాలని ఏ అవసరమున్న తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులకుకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ లబ్ధిదారుడు పట్టెల నరేష్ మాట్లాడుతూ నిరుపేదనైన నాకు పల్లె బ్రదర్స్ అందించిన చేయూతకు కు జీవితకాలం వారి కుటుంబానికి రుణపడి ఉంటారని నా సొంతింటి కల సహకారం చేసుకునేందుకు వారి సహకారం ఎన్నటికీ మరువలేందని ఆయన పల్లె బ్రదర్స్ కు వారి కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజు మాజీ డిప్యూటీ సర్పంచ్ శ్రీనివాస్, బుర్రి మల్లేష్ గౌడ్, వట్టెల శ్రీశైలం యాదవ్, దుబ్బ జంగయ్య, వట్టెల శివ యాదవ్, ఈట మోని శేఖర్ యాదవ్, గురిగా ఆంజనేయులు, గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నాగసముందర్ శివారులో పేకాట రాయుళ్ల అరెస్ట్**

**ధారూర్,మార్చి 30, ప్రభాత వార్త:** ధారూర్ మండల పరిధిలోని నాగసముందర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను ధారూర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు.వివరాలు, గ్రామ శివారులోని డంపింగ్ యార్డ్ సమీపంలో కొందరు వ్యక్తులు గుంపుగా చేరి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ అబ్దుల్, మల్లేష్, నరేష్, వెంకట్ అనే నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షి ంచేది లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

**శ్రీరామనవమికి ఎస్సిలను అవమానించటం అనాగరికం**

**..మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్**

**శామీర్‌పేట, మార్చి 30, ప్రభాతవార్త:** అద్రాస్‌పల్లి గ్రామంలో జరిగిన శ్రీరామనవమి కల్యాణోత్సవం రోజున ఎస్సిలను పలువురు అవమానపర్చటం అనాగరికమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ పేర్కొన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని అద్రాస్‌పల్లి గ్రామాన్ని ఆయనతో పాటు పలువురు సిపిఐ నాయకులు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు సందర్శించి జరిగిన సంఘటన వివరాలను బాధిత ఎస్సిలను అడిగి తెలుసుకున్నారు. అయితే ఈ విషయంపై శామీర్‌పేట పోలీసులకు ఎస్సిలు ఫిర్యాదు చేయటం, దీన్ని శామీర్‌పేట పోలీసులు ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ మాట్లాడుతూ శ్రీరామనవమి రోజున శ్రీసీతారాముల కల్యాణం చూడటానికి వెళ్లిన ఎస్సీలను ఆలయంలోకి రావద్దని, కొబ్బరికాయలు కొట్టవద్దని కొంత మంది మహిళలు కులం పేరుతో దూషించటం, అదే విధంగా అన్నదానం చేసే సమయం లోనూ ఎస్సీలను అవమానపర్చటం జరిగిందని, నాగరిక సమాజంలో అనాగరికి సంఘటన చోటుచేసుకోవటం దారుణమన్నారు. జరిగిన సంఘట వివరాలు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం ఖండించారు. అయితే పలువురు ఎస్సీలు గ్రామంలో దేవాలయానికి అన్ని కులాలతో పాటు సమానంగా పూజారికి మేము కూడ జీతాలను ఇస్తున్నామని, అన్ని పండుగల సందర్భంలో జరిగే ఖర్చులను గ్రామంలోని ప్రతి కులం వారు సమానంగ ఖర్చు పెడుతున్నట్లు తాము కూడ చందాలు ఇస్తున్నామని అయినా కులం తక్కువ అనే వ్యత్యాసం గతంలో నుంచి జరుగుతూనే ఉందని కొంత మంది మహిళలు రెచ్చగొట్టి మమ్ముల్ని అవమాన పరుస్తున్నారని ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే తగు చట్టరీత్య చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు దోరవి బాబు, సిపిఐ మండల కార్యదర్శి టి.రాములుగౌడ్, శామీర్‌పేట సిపిఐ మండల కార్యదర్శి నరేంద్రప్రసాద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహరెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఉపసర్పంచు జహంగీర్, గ్యార చంద్రయ్య, రాములు, బాలయ్య, పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**తలకొండపల్లి ,మార్చి 30,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో 2008-09 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.తలకొండపల్లిలో ఉన్నత పాఠశాలలో ఎస్ ఎస్ సి చదివిన విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేస్కుంటూ ఆటపాటలతో సంతోషంగా గడిపారు.చిన్నతనంలో తను తరగతి గదిలో చేసిన అల్లరి పనులు,మరియు ఉపాధ్యాయుల విధుల పట్ల నెమరు వేసుకొని ఆనందింప చేశారు.ఒక్కొ క్కరు తాము చేస్తున్న పనులు,ఉపాధి వివరాలు తెలుసుకొని సంబరపడ్డారు.అనంతరం భోజనాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతిరాణి, శారదా, వసుంధర, ఆంజనేయులులను ఘనంగా విద్యార్థులు సన్మానించారు,పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికీ కృషి చేస్తామని చెప్పినారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉద్యమకారుల అరెస్టు అప్రజాస్వామికం

**తలకొండపల్లి, మార్చి30,ప్రభాత వార్త:** స్వరాష్ట్ర సాధన కోసం ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించుకుని ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చుకున్న తరుణంలో ఉద్యమకారుల సంక్షేమం కోసం పోరాడు తున్నవేళ వారిని ముందస్తు అరెస్టుల పేరిట నిర్బంధించడం ప్రజావ్యతిరేక మని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అమన్ గల్ బ్లాక్ అధ్యక్ష కార్య దర్శులు దర్శుల శంకర్,నరేష్ లు ఖండించారు. సోమవారం పలుచోట్ల తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని వారు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాలు పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నాయని ఇందులో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. షాద్ నగర్ లో వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టు తెలంగాణ ఉద్యమకారులు ఎండి ఖాజాపాషా (కేపి)నీ పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. తెలంగాణ రెండవ విడత ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించిన మీడియా ప్రతినిధులు స్వరాష్ట్రం సాధించుకున్నాక ఇప్పుడు ఇండ్ల వద్దకు వచ్చి జర్నలిస్టులను సైతం అరెస్టు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఉద్యమ వార్తలను వారు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రజలను చైతన్యపరిచారన్నారు. ఆనాడు జర్నలిస్టులు ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించి, రాష్ట్ర సాధన కోసం గళమెత్తారన్నారు.

## కొప్పు యశోదకు ఉగాది నటరాజ జాతీయ పురస్కారం

**యాచారం, మార్చి 30, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి చెందిన జానపద కళాకారుని కొప్పు యశోదకు ఉగాది నటరాజ జాతీయ గౌరవపరస్కారం అందజేశారు. హైదరాబాద్‌లోని తెలుగు వెలుగు సాహితీ వేదిక తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్ శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ ఆధ్వర్యంలో జానపద కళా రంగంలో పాటలు పాడుతూ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న వారికి సత్కరించినట్లు పేర్కొన్నారు. తన నైపుణ్యాన్ని గుర్తించి సత్కరించిన సంస్థకు పెద్దలందరికీ యశోద కృతజ్ఞతలు తెలిపారు.



యశోదను సన్మాని స్తున్న తెలుగు వెలుగు సాహితి సభ్యులు

## ప్రతిభతోనే ఉజ్వల భవిష్యత్తు

**అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**

**షాబాద్, మార్చి 29, ప్రభాతవార్త :** మారుతున్న సామాజిక పోకడలు, గ్లోబలైజేషన్ అనుగుణంగా ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. షాబాద్ మండలం నాగర గూడ శ్రీ చైతన్య హైస్కూల్లో సోమవారము గ్రాడ్యుయేషన్ అండ్ కల్చరల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ ప్రసాద్ సిద్ధాపురం, శిరీష సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా జరిగినవి. కార్యక్రమంలో ముందుగా విద్యార్థులు సావుస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అశేషంగా తరలివచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల ప్రతిభ పాటవాలను చూసి ప్రశంసించారు.

ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల కృషి ఉంటే ఎప్పటికైనా విజయాలు సాధ్యమని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రతిపాప వల్ల అందించడంలో ఎంతో కృషి చేస్తున్నాయని వివరించారు. దాదాపు 18 ఏళ్లుగా నిర్విరామ కృషితో విద్యార్థులను తీర్చిదిద్దడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరాములు, డైరెక్టర్ సుశాంత్, ఇన్చార్జ్ రాజ నరేందర్, మధు, అజయ్, సఫియా, అపర్ణ , సునంద, మాధవి , ప్రభావతి , అనురాధ, ప్రవీణ్ , పావని , శిల్పా, నేహా, కీర్తన ,సంతోష, అరుణ ,సునీత ,శ్రీలత తదితరులు పాల్గొన్నారు.